సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



నగరంలో
సంయుక్త మీనన్ 8లో



అమరావతిలో ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో విశాఖ,అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు హరేందిర ప్రసాద్, విజయకృష్ణన్ పాల్గొన్నారు. - మహారాణిపేట



ఉక్కు కార్మికులకు
వేతనాలు చెల్లించాలి 8లో

న్యూస్‌రీల్

ఆరుగురు సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో ఇద్దరిని విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంవీపీ లా అండ్ ఆర్డర్ సీఐ జె.మురళి, వెస్ట్ జోన్ క్రైమ్ సీఐ ఎన్.శ్రీనివాసరావును విశాఖ రేంజ్‌కు సరెండర్ చేశారు. వీరి స్థానంలో ఎంవీపీ లా అండ్ ఆర్డర్‌కు ద్వారకా ట్రాఫిక్ సీఐగా ఉన్న కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్‌ను, వెస్ట్ జోన్ క్రైమ్‌కు సిటీ వీఆర్-2లో ఉన్న మీసాల చంద్రమౌళిని నియమించారు. అలాగే ద్వారకా ట్రాఫిక్‌కు పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న ఎస్.వి.ప్రభాకర్‌రావు, సిటీ వీఆర్-1లో ఉన్న బి.భాస్కరరావును పోలీస్ కంట్రోల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే ఎంవీపీ లా అండ్ ఆర్డర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.సుభాకరరావును పద్మనాభం లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు.

రేపు ముఖ్యమంత్రి విశాఖ రాక



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ మయూర్ అశోక్, సీపీ బాగ్చి, ఇతర అధికారులు

మహారాణిపేట: ఒక రోజు పర్యటన నిమిత్తం ఈ నెల 17న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ రానున్నారు. ఆ రోజు ఉదయం 11.25 గంటలకు బీచ్ రోడ్డులో గల ఏయూ సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఉమెన్ అండ్ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించే 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 3 గంటలకు రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొంటారు. సాయంత్రం 5.20 గంటలకు తాడేపల్లి బయలుదేరి వెళతారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జేసీ కె.మయూర్ అశోక్, ఇతర జిల్లా అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

వచ్చే నెల 12న మరో అంతర్జాతీయ సదస్సు

విశాఖ సిటీ: విశాఖ నగరంలో మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. వచ్చే నెల 12న అంతర్జాతీయ రోబోటిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సదస్సు వెల్కమ్ గ్రాండ్ బే హోటల్‌లో జరగనుంది. ఇందులో యూకే, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూరప్ దేశాల నుంచి రోబోటిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఔషధ, హెల్త్‌కేర్ పరిశ్రమల్లో ఆవిష్కరణలు, వ్యాపారానికి ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు.

లా కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ లా కళాశాలలో సీట్ల భర్తీకి (సెల్ఫ్ ఫైనాన్స్) దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 18 సీట్లు ఖాళీ ఉన్నాయి. ఇంటర్మీడియట్‌లో 45 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.90 వేలు. అలాగే మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 15 సీట్లు ఖాళీ ఉన్నాయి. దీనికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. కోర్సు ఫీజు రూ.90 వేలు. రెండేళ్ల పీజీ ఎల్ఎల్ఎం కాన్‌స్టిట్యూషనల్ లా లా కోర్సులో 5 సీట్లు ఉన్నాయి. ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులు. ఫీజు రూ.90 వేలు, అలాగే ఎల్ఎల్ఎం ఇంటర్నేషనల్ లా కోర్సులో 5 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల వారు దరఖాస్తులను ఈనెల 16 నుంచి 27వ తేదీలోగా చేసుకోవాలని సూచించారు. ఈనెల 29వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

19న జాబ్‌మేళా

కంచరపాలెం: వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న సుమారు 100 ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్(ఎన్‌సీఎస్‌సీ)లో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ఉప ప్రాంతీయ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ తెలిపారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బీపీవో, టెలీకాలింగ్, ఆపరేటర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన 18-35 ఏళ్ల మధ్య వయసు కల్గిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. జాబ్ లోకేషన్ విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి రూ.1.2 లక్షల నుంచి రూ.2.8 లక్షలు ఏడాదికి జీతం ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులు కంచరపాలెం ఎన్‌సీఎస్‌సీ కేంద్రంలో జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

పత్రికల గొంతు నొక్కేయడం తగదు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అసమర్థపాలన కొనసాగుతోంది. మాట వినని అధికారులను వేధింపులకు గురి చేస్తున్నారు. పచ్చపత్రికలు ఈ వాస్తవాలను ఎలాగూ ప్రజలకు చూపించరు. 'సాక్షి' పత్రిక మాత్రమే నిర్భయంగా నిజాలను ప్రజలకు చేరవేస్తోంది. వీటిని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక సాక్షి పత్రికపై కేసులు నమోదు చేయడం, ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు అందించడం రాజ్యాంగ విరుద్ధం. పత్రికల గొంతునొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడమే. అలాంటి ప్రభుత్వాలు ఎంతోకాలం మనుగడ సాగించలేవని చరిత్ర చూస్తే తెలుస్తుంది.

- మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త



భావప్రకటన స్వేచ్ఛను అణగదొక్కడం అవివేకం



పత్రికలనేవి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయి. అటువంటి పత్రికా వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్ష సాధించడం దారుణం. రాజకీయ పార్టీ నాయకుడి ప్రెస్‌మీట్‌ను వార్త రూపంలో రాస్తే పాత్రికేయుడిపైన, సాక్షి ఎడిటర్‌పైన కేసులు నమోదు చేయడం చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. పత్రికా వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. కూటమి ప్రభుత్వం విష సంస్కృతికి తెర లేపుతోంది. భావ ప్రకటన స్వేచ్ఛను హరించాలని చూడటం మానుకోవాలి. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను.

- కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్యే

రేటే బంగారమాయెనే..







- రోజురోజుకీ పెరుగుతున్న పుత్తడి ధర
- 10 గ్రాముల ధర రూ.1.11 లక్షల పైమాటే..
- ఇప్పట్లో రూ.లక్ష దిగువకు వచ్చే సూచనలు లేవంటున్న వ్యాపారులు
- అదే బాటలో దూసుకుపోతున్న వెండి

సాక్షి, విశాఖపట్నం : పసిడితో భారతీయులకు ఉన్న అనుబంధం మరే దేశంలోనూ కనిపించదు. చేతిలో కొద్దిగా డబ్బులు కనిపిస్తే.. వెంటనే కొనుగోలు చేసేది బంగారాన్నే. ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా.. పుత్తడి కొంటే.. శుభసూచకమని అంటుంటారు. అందుకే స్వర్ణం.. సమస్తమయమైపోయింది. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్ నేపథ్యంలో రోజురోజుకీ పసిడి ధర పైపైకి ఎగబాకుతూ.. ఆల్‌టైమ్ హై రేట్‌ని నమోదు చేస్తోంది. ఒకప్పుడు 10 గ్రాముల ధరతో ఇప్పుడు గ్రాము కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి. వారం రోజులుగా ఎగబాకుతున్న బంగారాన్ని చూసి.. వెండి కూడా అదే బాటలో దూసుకుపోతోంది. లక్ష రూపాయల కంటే దిగువకు బంగారం ధర దిగే రోజులు ఇప్పట్లో కనిపించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గేదేలే అంటున్న పుత్తడి

గత వారం రోజులుగా బంగారం ధర తగ్గేదేలే అన్నట్లుగా దూసుకుపోతోంది. ఈ నెల 8వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08, 380 ఉండగా.. 9వ తేదీన రూ.1,10,290కి చేరుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.1.10 లక్షలకు తక్కువ కాలేదు. వెండి కూడా ధగధగ మెరిసిపోతోంది. ఈ నెల 8న కిలో వెండి ధర రూ.1.37 లక్షలు ఉండగా.. 15వ తేదీ నాటికి రూ.6 వేలు పెరిగి రూ.1.43 లక్షలకు చేరుకుంది. అంటే రోజుకు దాదాపు రూ.1000 చొప్పున పెరుగుతూ వస్తోంది.

పెట్టుబడి విషయంలోనూ బంగారమే..!

రోజు రోజుకీ ధర పెరుగుతూ వస్తున్నా బంగారం కొనుగోలు విషయంలో మాత్రం ప్రజలు అస్సలు తగ్గేదే..లే అంటున్నారు. ఎందుకంటే ఇంట్లో పసిడి ఎంత ఉంటే అంత ఎక్కువ సొమ్ము ఉన్నట్లుగా భావిస్తారు. వాస్తవానికి బంగారం నిరర్థక ఆస్తి. ఎంతో కష్టించి సంపాదించిన సొమ్ము బంగారంగా మార్చితే బీరువాల్లోనూ, బ్యాంకు లాకర్లలోనూ భద్రంగా ఉంచడం తప్ప... మరో ప్రయోజనం ఏంటి..? భవిష్యత్తులో ధర పెరిగి, పెరిగిన ధరకు దాన్ని విక్రయిస్తేనే లాభం. మనకు తెలిసినంత వరకూ బంగారం కొనడమే కానీ.. విక్రయించడమన్నది అరుదు. దీని బదులు వాటిని ఉత్పత్తి కార్యకలాపాలకు వెచ్చిస్తే సంపద సృష్టి జరుగుతుంది. మన దేశంలో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయడంలో బంగారం మూడో స్థానాన్ని ఆక్రమించింది. ముడిచమురు, క్యాపిటల్ గూడ్స్ తర్వాత అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న సరకు బంగారమేనన్నది విస్మయపరిచే అంశం. ఇటీవల కాలంలో మనదేశంలో బంగారం కొనుగోళ్లు అధికమై.. నగదు పొదుపు మొత్తాలు తగ్గిపోతున్నాయి. గృహస్తులు ఇతర వాటిపై ఒక్క శాతం పెట్టుబడులు పెడుతుండగా బంగారంపై మాత్రం ఆరున్నర రెట్లు ఎక్కువ మొగ్గు చూపుతుండటం విశేషం.

గత వారం రోజులుగా నగరంలో 10 గ్రాముల బంగారం, కిలో వెండి ధరలు

తేదీ	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కిలో వెండి
ఈనెల 8	1,08,380	99,350	1,37,000
9	1,10,290	1,01,100	1,40,000
10	1,10,510	1,01,300	1,40,000
11	1,10,510	1,01,300	1,40,000
12	1,11,280	1,02,000	1,42,000
13	1,11,170	1,01,900	1,43,000
14	1,11,170	1,01,900	1,43,000
15	1,11,060	1,01,800	1,43,000

బంగారానికి ఇంత వన్నె ఎందుకో..?

పుత్తడి ఎంత ఉన్నా సగటు వ్యక్తికి మోజు తీరడం లేదు. తన శక్తి మేరకు బంగారాన్ని సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. అసలు బంగారానికి ఇంత వన్నె ఉండటానికి కారణం అంతర్జాతీయ కరెన్సీకి ప్రత్యామ్నాయం కావడమే. ఒక దేశం జారీ చేసిన నోట్లు చెల్లకపోవడం. వాటి విలువ క్షీణించడం ఉంటుంది. కానీ బంగారానికి అలాంటి బేధాలేమీ లేవు. ఎప్పుడైనా ఎక్కడైనా ఎంతో కొంత ధరకు చెలామణి అవుతుంది. అందుకే స్వర్ణానికి అంత కళ. ధర తగ్గినా పెరిగినా కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. ప్రపంచ స్వర్ణమండలి(డబ్ల్యూజీసీ) అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని సంస్థలు, గృహస్తులు, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద 25 వేల టన్నుల బంగారం ఉంది. భారత్‌లో మొత్తం ఇళ్లల్లోనూ, ఇతర అవసరాలకు ఈ బంగారం వివిధ రూపాల్లో నిల్వ ఉంది. ఇందులో విశాఖ నగర జనాభా ప్రకారం 80 నుంచి 100 టన్నుల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం సగటున విశాఖ నగరంలో ప్రతి ఇంటిలోనూ 15 నుంచి 25 గ్రాములు వరకూ బంగారం ఉంటుదని నివేదికలు చెబుతున్నాయి.

కొనుగోళ్లు తగ్గినా.. మార్కెట్ దూసుకుపోతోంది



టెక్స్‌టైల్స్ మార్కెట్ 15 నుంచి 20 శాతం పడిపోయింది. బంగారం మార్కెట్ కూడా 15 నుంచి 20 శాతం పడిపోయింది. మార్కెట్ విలువ మాత్రం బంగారం విషయంలో ఏమాత్రం తగ్గలేదు. చైనా, భారత్ వంటి దేశాలు బంగారాన్ని కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. గతంలో పసిడి ధర మూడు నాలుగు రోజులకోసారి మారేది. ఇప్పుడు ఒక పూట ఉన్న రేటు మరో పూటకు ఉండటం లేదు. బులియన్ మార్కెట్ కూడా అంచనా వేయలేకపోతోంది. పెట్టుబడుల విషయంలోనూ బంగారానికి మంచి డిమాండ్ ఉంది. బంగారంతో వెండి పోటీ పడుతోంది. బ్యాటరీ కార్లలో వెండి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ధరల పెరుగుదలకు ఓ కారణమని చెప్పవచ్చు.

- కంకటాల మల్లికార్జునరావు, ఫ్యాప్సీ పాస్ట్ ప్రెసిడెంట్

డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 1,134 పోస్టుల భర్తీ

ఆరిలోవ : ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ-2025లో భాగంగా 1,139 పోస్టులకు ఎంపిక జాబితా విడుదల చేసినట్లు డీఈవో ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. ఐదు ఉర్దూ పోస్టులకు రోస్టర్ విధానం ప్రకారం అభ్యర్థులు లేకపోవడంతో 1,134 పోస్టులు భర్తీకానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో పాటు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 19న అమరావతిలో జరగనున్న సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియామక పత్రాలు అందజేస్తారన్నారు. అనంతరం రెండు రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఉంటుందని తెలిపారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ (9440484917, 9177292969, 9618584051) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18న అమరావతి వెళ్లేందుకు వీలుగా ఉక్కునగరంలో గల విశాఖ విమల స్కూల్ నుంచి ఉదయం 7.30 గంటలకు బస్సులు బయలుదేరతాయని తెలిపారు. ఆ సమయానికి అభ్యర్థులంతా విశాఖ విమల స్కూల్ వద్దకు చేరుకోవాలని కోరారు.

నేడు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రాక

మహారాణిపేట: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి రాత్రి 8.45 విశాఖ విమానంలో చేరుకుంటారు. రాత్రి రాడిసన్ బ్లూ హోటల్‌లో బస చేస్తారు. 17న వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే జీఎస్టీ సెమినార్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు రాడిసన్ హోటల్‌లో జరిగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొంటారు. రాత్రి 6.15 గంటలకు విమానంలో ఢిల్లీ వెళ్తారు.

వందేభారత్ ప్రయాణంలో స్వల్పమార్పులు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ (20707/20708) వందేభారత్ నడిచే రోజుల్లో డిసెంబరు 2వ తేదీ నుంచి స్వల్ప మార్పులు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం గురువారం తప్ప మిగిలిన అన్ని రోజుల్లో నడుస్తుంది. కానీ డిసెంబరు 2వ తేదీ నుంచి ఈ రైలు సోమవారం తప్ప మిగిలిన అన్ని రోజుల్లో నడుస్తుంది.

రేపటి నుంచి 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

మహారాణిపేట: స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఈనెల 17న నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈనెల 17న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. కార్యక్రమానికి వచ్చే స్త్రీలకు, పిల్లలకు అవసరమైన అన్ని వైద్య సేవలు, పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఆదేశించారు.

'మూర్తియాదవ్ వేధింపులపై ఆర్పీల నిరసన'



నిరసన చేస్తున్న ఆర్పీలు

బీచ్‌రోడ్డు: వ్యక్తిగత కక్షలతో జనసేన పార్టీకి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్ తమను రాజకీయంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఏపీ మెప్మా ఆర్పీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించింది. యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ కార్పొరేటర్ వేధింపుల కారణంగా తొలగించిన ఐదుగురు ఆర్పీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తమ సమస్యలను ప్రశ్నించినందుకు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, కోశాధికారి సత్య వరలక్ష్మిలను తొలగించాలని కార్పొరేటర్ పీడీ, ఏపీడీపై ఒత్తిడి తెస్తున్నారని ఆమె ఆరోపించారు. మూర్తి యాదవ్‌ను ఎవరైనా విమర్శిస్తే తట్టుకోలేడని, వారి అంతుచూస్తానంటూ బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. ఈయన వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

మూడు నెలల బకాయి జీతాలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, ఉద్యోగ భద్రతకు భంగం కలిగించే సర్క్యులర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షులు ఎస్. లక్ష్మి, ఝాన్సీ, సత్య వరలక్ష్మి, ముఖ్య నాయకులు సుధా, వందన, ధనలక్ష్మి, లక్ష్మీ, దేవి, నూకరత్నం, జయ, మల్లీశ్వరి లత, చంద్రకళ, త్రివేణి, రామలక్ష్మి, గాయత్రి, హిమబిందు, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాలతో ఆడుకోవద్దు

కలెక్టరేట్ వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుల ఆందోళన



అంగవైకల్యం శాతాన్ని తగ్గించొద్దంటూ నినాదాలు చేస్తున్న దివ్యాంగులు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దివ్యాంగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ దివ్యాంగులు సోమవారం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ల రీ-వెరిఫికేషన్‌కు ఆదేశాలు ఇవ్వడం దివ్యాంగుల జీవితాలపై పిడుగుపాటు లాంటిదని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రీ-వెరిఫికేషన్ ప్రక్రియలో వైకల్యం శాతం తగ్గించడం.. సర్టిఫికెట్ రద్దు చేయడం వంటివి జరిగితే తాము పింఛన్లు కోల్పోతామని దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తుల డేవిడ్ రాజు మాట్లాడుతూ, అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు యథావిధిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్లలో వైకల్య శాతాన్ని తగ్గించవద్దని, 2010 నుంచి ఉన్న సర్టిఫికెట్లను మార్చవద్దని ఆయన కోరారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లు యథావిధిగా ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారికి వీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఎస్. మల్లేశ్వరి, దివ్యాంగులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను చేర్చుకోవాల్సిందే..



ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను చేర్చుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్మికులను చేర్చుకోవాలన్న డిమాండ్‌పై సోమవారం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు ట్రెనింగ్ విభాగం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సేఫ్టీ శిక్షణ కోసం వచ్చిన ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి కారణాలు లేకుండా కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. తొలగించడానికి కారణాలు చెప్పకుండా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఇదే వైఖరి కొనసాగితే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ వారి ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున మోహరించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, మంత్రి రవి, వంశీకృష్ణ, కోన రమణ పాల్గొన్నారు.

భద్రతలో జాగిలాల పాత్ర కీలకం



జాగిలాలతో మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : ప్రముఖుల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ రవాణా అడ్డుకట్ట వేయడం, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో జీవీఎంసీ సహకారంతో రూ.18 లక్షలతో నిర్మించిన జాగిలాల వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగిలాల ఆరోగ్య సంక్షరణపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో కూడా పోలీస్ శాఖకు సహకారం అందించేందుకు బీచ్ రోడ్డులో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గోవా తరహాలో విశాఖ బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ రాష్ట్రంలో 21 జాగిలాలు ఉన్న జిల్లాగా విశాఖ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. గతేడాది జిల్లా కలెక్టర్ నాలుగు, జీవీఎంసీ కమిషనర్ 4 జాగిలాలను స్పాన్సర్ చేశారన్నారు. గత నెలాఖరు నాటికి ఎనిమిది జాగిలాలు శిక్షణ పూర్తి చేసుకుని విశాఖ నగరానికి రిపోర్టు చేసినట్లు చెప్పారు. శిక్షణలో భాగంగా విశాఖకు చెందిన జాగిలం లైకా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుతం నగరంలో 10 నార్కోటిక్ డాగ్స్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీసీపీలు, ఏపీసీలు, డాగ్ కెన్నల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో సంయుక్త మీనన్



బీచ్‌రోడ్డు : ప్రముఖ నటి సంయుక్త మీనన్ సోమ వారం నగరంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, గతంలో ఇక్కడ షూటింగ్‌లలో పాల్గొన్నట్లు గుర్తు చేసుకున్నారు. విశాఖ అందమైన నగరమన్నారు. విశాఖ బీచ్‌లో గడపడమంటే ఎంతోఇష్టమన చెప్పారు. తన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఓ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు.

అవి కల్తీ ఆహారమే

- నిర్ధారించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బీచ్‌రోడ్డు: గత నెల 1, 2 తేదీల్లో నగరంలో నిర్వహించిన ప్రత్యేక ఆహార తనిఖీల్లో సేకరించిన నమూనాల్లో 15 కల్తీ ఆహారం ఉన్నట్లు తేలిందని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్. కల్యాణ చక్రవర్తి తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, బేకరీల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి మొత్తం 81 నమూనాలను సేకరించామని చెప్పారు. వాటిని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపగా, అందులో 15 నమూనాలు ఆరోగ్యానికి హానికరంగా, 14 తక్కువ నాణ్యతతో ఉన్నట్లు నివేదికలు వచ్చాయని తెలిపారు. ఆరోగ్యానికి హానికరం అని తేలిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, తక్కువ నాణ్యత ఉన్న వారిపై జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. నిల్వ ఉన్న ఆహారాన్ని తిరిగి వేడి చేసి అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు.

రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువ

మహారాణిపేట: జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై మొత్తం 329 ఫిర్యాదులు వచ్చాయి. అందులో అత్యధికంగా 92 రెవెన్యూ విభాగానికి సంబంధించినవే కావడం గమనార్హం.గత కొన్ని వారాలుగా రెవెన్యూ ఫిర్యాదులు పెరుగుతూనే ఉన్నాయి. స్థానిక తహసీల్దార్లు సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలనుంచి అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్. భవానీ శంకర్, ప్రత్యేక ఉప కలెక్టర్ శేషశైలజ, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయ రావు స్వీకరించారు. అర్జీల్లో జీవీఎంసీకి 88, పోలీసు విభాగానికి 25, ఇతర విభాగాలకు 124 ఉన్నాయి. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డీఆర్‌వో అధికారులను ఆదేశించారు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్

తమ పిల్లలను ఆదుకోవాలి



డీఎండీ వ్యాధిగ్రస్తులు, వారి తల్లిదండ్రులు

మహారాణిపేట: డుచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ (డీఎండీ) అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న తమ పిల్లలను ఆదుకోవాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 11 మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు, బంధువులు డీఆర్‌వో భవాని శంకర్‌కు సమస్యను వివరించారు. డీఎండీ వ్యాధి వల్ల గుండె కండరాలు బలహీనపడతాయని, క్రమంగా పరిస్థితి క్లిష్టంగా మారుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ న్యూరో–మస్క్యులర్ జెనిటిక్ వ్యాధి సాధారణంగా అబ్బాయిల్లో ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. తమ పిల్లలకు ప్రత్యేక చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దీని కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత పిల్లలు రితీష్, మౌనిక, భావన, హర్ష, షన్వీక్‌లతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువులు పాల్గొన్నారు.

'కోడలు కుటుంబం నుంచి రక్షణ కల్పించాలి'



మాట్లాడుతున్న బెల్జియంకు చెందిన వరహామన్

మహారాణిపేట: తమకు రక్షణ కల్పించాలని కోరుతూ బెల్జియంకు చెందిన ఓ కుటుంబం సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించింది. బెల్జియంలో పుట్టి పెరిగి, విశాఖలో స్థిరపడిన వరహామన్ లూసీన్, అతని భార్య ధనలక్ష్మి ఈ వినతిని సమర్పించారు. వారి కుమారుడు అశోక్ కుమార్, బిందురాణిని ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొద్ది కాలం తరువాత బిందురాణి కుటుంబ సభ్యులు తమను వేధిస్తున్నారని వారు ఆరోపించారు. ఇటీవల పలాసలో బిందురాణి కుటుంబం తమపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిందని వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా పలాస వెళ్లడానికి భయపడుతున్నామని, ఈ కేసును విశాఖకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫోన్‌లో కూడా మాట్లాడరా?

అధికారులపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆగ్రహం

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. ఒక వ్యక్తి తన వినతిపత్రాన్ని సమర్పించడానికి అక్కడికి వచ్చాడు. అనంతరం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుతో ఫోన్‌లో మాట్లాడాలని అక్కడి అధికారులను కోరారు. అయితే అధికారులు అందుకు నిరాకరించారు. దీంతో ఫోన్ లైన్‌లో ఉన్న పరశురామరాజు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న బీజేపీ నాయకులకు అధికారులు విలువ ఇవ్వడం లేదని, కనీసం ఫోన్‌లో మాట్లాడటానికి కూడా నిరాకరించడం ఏమిటని ప్రశ్నించారు. ఎండాడలోని తమ భూములకు రీ–సర్వే చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

మహారాణిపేట: సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఏపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు ఎ. అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు త్రినాథ మూర్తితో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్ట ప్రకారం సత్వరమే పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 115 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో వీడియో కన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ వాటిని త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 111 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 111 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అత్యధికంగా 51 ఫిర్యాదులు అందాయి. ఇంజినీరింగ్ విభాగానికి 28, ప్రజారోగ్య విభాగానికి 13, రెవెన్యూ విభాగానికి 11, మొక్కల విభాగానికి 3, యూసీడీ విభాగానికి 3, అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చాయి. అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు డీఈవో అభినందనలు



ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో ప్రేమకుమార్

ఆరిలోవ: ఈ ఏడాది గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. అవార్డులు పొందిన కుమారస్వామి, సుజాత, మోహనరావు సోమవారం డీఈవో ఎన్. ప్రేమకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో శ్రీరామ్

అల్లిపురం: ఎంవీపీకాలనీలో ఉంటున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ భైవరపట్ల శ్రీరామ్(41) సూర్యాబాగ్‌లో గల ఒక హోటల్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం సూర్యాబాగ్‌లో గల రాఘవేంద్ర హోటల్‌లో ఆయన అద్దెకు తీసుకున్న గది నుంచి ఘాటైన వాసన రావడంతో సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ కొల్లి సతీష్, కానిస్టేబుళ్లు గది తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లే సమయానికి శ్రీరామ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. హోటల్ గదిలో దొరికిన లేఖలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రాసి ఉన్నట్లు తెలిపారు. సకాలంలో స్పందించి ఒకరి ప్రాణాన్ని రక్షించినందుకు గాను సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను సీపీ అభినందించారు.

ఉక్కు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కంచాలు కొట్టి మహిళల నిరసన



కంచాలతో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగుల కుటుంబీకులు అడ్మిన్ బిల్డింగ్ కూడలి పెద్ద ఎత్తున ధర్నాలో చేశారు. మహిళలు, ఉద్యోగులు కంచాలు కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు జీతాల చెల్లించామని కేంద్ర ఉక్కు మంత్రి ప్రకటించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉక్కు కార్మికులకు గత ఏడాదిగా పూర్తి జీతాలు చెల్లించకుండా యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. జీతాలు చెల్లించమని అడిగిన కార్మిక నాయకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు బోనస్ చెల్లించే అంశంపై చర్చలు జరుగుతుంటే ఇక్కడ జీతాల చెల్లించకుండా వేధిస్తున్నారన్నారు. జిల్లా సీఐటీయూ నాయకులు ఎస్.రామారావు మాట్లాడుతూ జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై చర్యలు చేపట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వై.టి.దాస్, మహిళా నాయకురాలు వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన

- జీవీఎంసీ అధికారులపై చర్యలకు డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ప్రగతిశీల మహిళా సంఘం ధర్నా



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మురికివాడ వాసులు

మహారాణిపేట: జీవీఎంసీ పరిధిలోని 51వ వార్డు మాధవధార సర్వే నంబర్ 9లో ఉన్న ప్రభుత్వ భూమిని జిరాయితీగా చూపిస్తూ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ అక్రమాలకు సహకరించిన జీవీఎంసీ రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసి, వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 9లోని ప్రభుత్వ భూమిని ఉపయోగించుకొని కబ్జాదారులు కోర్టుల్లో భూ హక్కులు పొందేందుకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. దీంతో పాటు మురికివాడల అభివృద్ధిలో అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని మురికివాడలను నోటిఫై చేయాలని, జీవో నంబర్ 30 ప్రకారం పేదల నివాసాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, మురికివాడల ముఖచిత్రం మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మురికివాడల కోసం ఉద్దేశించిన చట్టాలు, పథకాలు, జీవోలు ఏవీ అమలు కావడం లేదని తెలిపారు. మురికివాడల అభివృద్ధికి కేటాయించిన 40 శాతం నిధుల్లో ఒక్క శాతం కూడా ఖర్చు చేయడం లేదని, ప్రాథమిక వసతులైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటివి కూడా కల్పించడం లేదన్నారు. ఇటీవల ఆర్అండ్‌బీ వద్ద ఉన్న తాటిచెట్లపాలెం, ఏఎస్ఆర్ నగర్ వంటి ప్రాంతాల్లోని టిడ్కో ఇళ్లకు అధిక పన్నులు వేశారని, అవి పేదల స్థాయికి మించి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు తగ్గించమని కోరితే, అవి నోటిఫై చేసిన మురికివాడలు కాదని అధికారులు చెబుతున్నారని, అయితే నోటిఫై చేయాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారులదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం కన్వీనర్ ఈ.లక్ష్మి, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్. వెంకటలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అరుణోదయ సంఘం జిల్లా కన్వీనర్ రామకృష్ణ, ఎంఎంఎస్ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, జిల్లా నాయకులు కె.అప్పారావు, పరదేశి, అప్పన్న, వీర్రాజు, జయమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన విద్యార్థుల మృతదేహాలు



విద్యార్థుల మృతదేహాలు

కొమ్మాది: రుషికొండ బీచ్‌కు సమీపంలో ఆదివారం సాయంత్రం పీఎంపాలేనికి చెందిన ఇద్దరు విద్యార్థులు గల్లంతైన సంఘటన తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున రుషికొండ బీచ్ సమీపానికి శ్యామ్ సాయి, సంజయ్‌లు మృతదేహాలు కొట్టుకొచ్చాయి. ఆదివారం సాయంత్రం పీఎంపాలేనికి చెందిన నలుగురు స్నేహితులు సంజయ్, శ్యామ్ సాయి, సాగర్, టి. బాలాదిత్య సినిమాకు వెళ్తామని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి సాయంత్రం 5 గంటల సమయంలో రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. వీరిలో ముగ్గురు పదో తరగతి చదువుతుండగా, ఒకరు ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. ఈ నలుగురు రుషికొండ బీచ్ వద్ద అరగంట సరదాగా గడిపారు. అనంతరం బీచ్‌లో స్నానాలు చేయడానికి దిగుతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డ్స్ చీకటి పడుతుందని వారిని నీళ్లల్లోకి వెళ్లవద్దని హెచ్చరించారు. దీంతో అక్కడ నుంచి వెళ్లిపోయి ఏ1 గ్రాండ్ ఫంక్షన్‌హాల్ వెనుక ఉన్న బీచ్ వద్దకు వెళ్లి స్నానాలకు దిగారు. ఇదంతా ప్రమాద స్థలం. వీరు నలుగురు స్నానాలు చేస్తూ, ఈత కొడుతున్న క్రమంలో మండల సంజయ్, శ్యామ్ సాయి కెరటాల తాకిడికి కొట్టుకుపోయారు. వీరి కోసం అధికారులు, పోలీసులు, లైఫ్‌గార్డ్స్ ఎంత గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం విగతజీవులుగా తీరానికి కొట్టుకొచ్చారు. మృతదేహాలు చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మ్యూల్ అకౌంట్లు సరఫరా చేసిన ముగ్గురి అరెస్ట్

విశాఖ సిటీ: సైబర్ నేరాలకు బ్యాంక్ ఖాతాలను సరఫరా చేస్తున్న ముగ్గుర్ని సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌కు చెందిన మెయినుద్దీన్ దేశ్వాలి, గణేష్ కుమావత్, దినేష్ ప్రజాపత్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్‌నగర్‌లోని 57 ఏళ్ల గృహిణికి జపాన్ కోడ్‌తో కూడిన ఒక నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. తన బంధువుగా పరిచయం చేసుకున్న ఒక వ్యక్తి, అత్యవసరంగా డబ్బు కావాలని అడిగారు. అతడి మాటలు నమ్మిన బాధితురాలు మొత్తం రూ.4 లక్షలు అతడి బ్యాంక్ ఖాతాకు పంపించారు. మరింత డబ్బు కావాలని అడగడంతో అనుమానం వచ్చిన ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, బాధితురాలు డబ్బు పంపిన బ్యాంక్ ఖాతాను ట్రేస్ చేశారు. ఆ ఖాతాలు రాజస్థాన్‌కు చెందినవిగా గుర్తించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ బృందం రాజస్థాన్‌కు వెళ్లింది. అక్కడ విచారణ జరిపి, ఈ ముగ్గురు నిందితులను అరెస్టు చేసింది. వారి నుంచి అనేక మొబైల్ ఫోన్లు, బ్యాంక్ ఖాతాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రిమాండ్‌కు తరలించారు. దీని వెనుక ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జేపీ నడ్డా దిష్టిబొమ్మ దహనం



నడ్డా దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

బీచ్‌రోడ్డు: విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల తొలగింపు, ప్రైవేటీకరణపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ పర్యటనలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండించాయి. ఈ చర్యకు నిరసనగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నడ్డా దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యూ. నాగరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా విశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న పీవీఎస్ఎన్ మాధవ్ స్టీల్‌ప్లాంట్‌కు జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, అలాగే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. పునాదులు కూడా పడని మిట్టల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ఎంపీలు కోరడం సరికాదని వారు మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన, విద్యార్థి, మహిళా సమాఖ్య ఎస్ మధురెడ్డి, కెల్ల రమణ, హేమానంద్, గ్రేస్ ప్రకాష్, దేముడమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి



మాట్లాడుతున్న రిమ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ తెన్నేటి జయరాజు

సీతంపేట : మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించడాన్ని నిలిపివేయాలని రిమ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ తెన్నేటి జయరాజు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదొక రాజకీయ నిర్ణయమని... ప్రజలు ఓటు ద్వారానే గుణపాఠం చెప్పాలన్నారు. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో సీట్లు లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసే స్థితి దళిత బహుజనులకు లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఏఎంఎస్ కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించడం దారుణమన్నారు. దీనివల్ల వైద్యులు, సిబ్బంది నియామకాల్లో రిజర్వేషన్లు కోల్పోతామని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు వజ్జిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ దళిత బహుజనులకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం వెనుక ప్రభుత్వ కుట్ర దాగి ఉందన్నారు. సమావేశంలో స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు దాస్, సీపీఎం నాయకుడు కృష్ణారావు, భారత బచావో నాయకుడు ఎస్ఆర్ వేమన, ఏఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.